సాక్షి యాదాద్రి భువనగిరి

మంగళవారం । 2 । సెప్టెంబర్ । 2025



సెల్‌ఫోన్ వదిలితేనే స్టీరింగ్

ప్రమాదాలకు చెక్ పెట్టేందుకు ఆర్టీసీ నిర్ణయం తీసుకుంది. డ్రైవర్లు సెల్‌ఫోన్ వాడొద్దని ఆదేశాలు జారీ చేసింది. -10లో



భద్రత మరింత పెంచాలి

యాదగిరి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి, భక్తులకు భద్రత మరింత పెంచనున్నట్లు ఈఓ వెంకట్రావ్ తెలిపారు. -10లో



కృష్ణమ్మ పరవళ్లు

నాగార్జునసాగర్‌కు ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. సోమవారం 3,28,996 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. -10లో

న్యూస్‌రీల్

వయోవృద్ధుల సమస్యల పరిష్కారానికి కృషి

భువనగిరిటౌన్ : వయోవృద్ధుల సమస్యల పరిష్కారానికి ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ కృషి చేస్తుందని అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు తెలిపారు. భువనగిరిలోని ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ కార్యాలయంలో సోమవారం సీనియర్ సిటిజన్ ట్రిబ్యునల్ ద్వారా పరిష్కారమైన బాధితులకు ఉత్తర్వుల కాపీ అందజేశారు. జిల్లా కేంద్రంలోని పెద్దవాడకు చెందిన మంద యాదగిరి, వసంతలు తమను కుమారులు పోషించడం లేదని ఇటీవల అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వెంకటేశం ద్వారా ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు. విచారణ అనంతరం తల్లిదండ్రుల పోషణ నిమిత్తం ప్రతి నెలా రూ. 7వేలు చెల్లించాలని సోమవారం ముగ్గురు కుమారులను ట్రిబ్యునల్ ఆదేశించింది. ఈ కార్యక్రమంలో కోశాధికారి దర్గాయి హరిప్రసాద్, కమిటీ కార్యనిర్వాహక సభ్యులు రామచంద్రారెడ్డి, కొంగరి రవీందర్, కానుగు రాము తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ కీలకం



విద్యార్థులకు ప్రశ్నలు వేస్తున్న కలెక్టర్ హనుమంతరావు

భువనగిరి: విద్యార్థి దశ చాలా కీలకమైందని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. సోమవారం భువనగిరి మండలం చందుపట్ల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సంఖ్య పెంచేలా కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రైవేట్ స్కూళ్లకు దీటుగా విద్యను అందించాలన్నారు. పదో తరగతి విద్యార్థులకు గణిత ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. అనంతరం గణితం ఉపాధ్యాయుడు యాదగిరిని శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

19న రామన్నపేటలో జాతీయ సాహిత్య సదస్సు



సాహిత్య సదస్సు కరపత్రం ఆవిష్కరిస్తున్న ఎంజీయూ వీసీ అల్తాఫ్ హుస్సేన్ తదితరులు

రామన్నపేట : తెలంగాణ సాహిత్య అకాడమీ సౌజన్యంతో ఈనెల 19న రామన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పద్మశ్రీ పురస్కార గ్రహీత డాక్టర్ కూరెళ్ల విఠలాచార్య ఆధ్వర్యంలో 'సాహిత్యం–సమాలోచనం' అంశంపై నిర్వహించే జాతీయ సాహిత్య సదస్సు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన కరపత్రాన్ని మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్ ఆచార్య అల్తాఫ్ హుస్సేన్ సోమవారం ఆవిష్కరించారు. కళాశాలలో సదస్సులు నిర్వహించడం వల్ల విద్యార్థుల్లో సాహిత్యంపట్ల ఆసక్తి పెరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రాహత్‌ఖానం, తెలుగుశాఖ అధ్యక్షుడు తండు కృష్ణకౌండిన్య, వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్‌రావు, అకడమిక్ కోఆర్డినేటర్ జె.చినబాబు పాల్గొన్నారు.

శివాలయంలో పూజలు

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి అనుబంధంగా ఉన్న శ్రీపర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి క్షేత్రంలో సోమవారం సంప్రదాయం పూజలు నిర్వహించారు. శివుడికి ఇష్టమైన రోజు కావడంతో రుద్రాభిషేకం, బిల్వార్చన, ఆలయ ముఖమండపంలోని స్ఫటిక లింగానికి ప్రత్యేక పూజలు చేశారు.

పనులొదిలి.. బారులుదీరి

యూరియా కోసం సొసైటీల వద్ద రైతుల పడిగాపులు



ఆత్మకూర్(ఎం) పీఏసీఎస్‌కు యూరియా కోసం పెద్ద సంఖ్యలో తరలివచ్చిన రైతులు

- సోమవారం పీఏసీఎస్‌లకు భారీగా తరలివచ్చిన రైతులు
- తెల్లవారుజాము నుంచే క్యూలైన్
- గంటల తరబడి నిలబడితే ఎకరాకు ఒక్కటే బస్తా యూరియా
- పోలీస్ పహారాలో పంపిణీ
- ఇంకా 2వేల మెట్రిక్ టన్నులు వస్తేనే సమస్యకు పరిష్కారం



అడ్డగూడూరు పీఏసీఎస్ వద్ద చెప్పులు క్యూలో పెట్టి నిరీక్షిస్తున్న రైతులు

సాక్షి, యాదాద్రి: యూరియా కోసం రైతులకు అవస్థలు తప్పడం లేదు. ఆత్మకూర్(ఎం), గుండాల, మోత్కూర్, బొమ్మలరామారం, రాజాపేట, రామన్నపేట, అడ్డగూడూరు, భూదాన్‌పోచంపల్లి సొసైటీలకు ఆదివారం తెల్లవారుజాము నుంచే రైతులు తరలివచ్చారు. పోలీస్ పహారాలో యూరియా పంపిణీ చేశారు. ఎకరాకు బస్తా చొప్పున అందజేశారు. ఇంకా రెండు వేల మెట్రిక్ టన్నుల యూరియా వస్తే గట్టెక్కుతామని అధికారులు అంటున్నారు. పది రోజులుగా కురుస్తున్న వర్షాలతో రైతులంతా ఒకేసారి పంట చేలకు యూరియా పెడుతుండటంతో డిమాండ్ పెరిగినట్లు చెబుతున్నారు.

యూరియా వివరాలు (మెట్రిక్ టన్నుల్లో)	
వచ్చిన మొత్తం	18,769
పంపిణీ	18,445
అందుబాటులో ఉన్నది	603

క్యూలో చెప్పులు ఉంచి నిరీక్షణ

సొసైటీలకు సరిపడా యూరియా రాకపోవడంతో రైతులకు అవస్థలు తప్పడం లేదు. వారం రోజులుగా సరఫరా కాకపోవడం, కొన్ని సొసైటీలకు ఆదివారం సాయంత్రం యూరియా వచ్చిందన్న సమాచారంతో రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పొద్దస్తమానం నిరీక్షించినా కొందరికే లభించింది. ఆత్మకూర్ సొసైటీకి లారీ లోడ్ రాగా.. అందులో సగం గుండాల సొసైటీకి పంపించారు. అడ్డగూడూరు పీఏసీఎస్ కార్యాలయం వద్ద రైతులు చెప్పులు, బస్తాలను క్యూలో ఉంచి యూరియా ఇచ్చే వరకు పడిగాపులు కాశారు.

పంటల సాగు, వచ్చిన యూరియా

జిల్లాలో 4,40,500 ఎకరాల్లో పంటలు సాగు కానున్నట్లు వ్యవసాయ అధికారులు అంచనా వేయగా సెప్టెంబర్ 1నాటికి 4,00,138 ఎకరాల్లో పంటలు వేశారు. ఇందులో అత్యధికంగా వరి 2,54,554, ఆ తరువాత పత్తి 1,13,193 ఎకరాల్లో సాగయ్యాయి. సీజన్ ప్రారంభం నుంచి ఇప్పటి వరకు 18,769 మెట్రిక్ టన్నులు యూరియా వచ్చింది.



మోత్కూరు మండలం దత్తప్పగూడెం గ్రామానికి చెందిన మామిడి నరసయ్య ఎకరన్నర వరి, తొమ్మిది ఎకరాల్లో పత్తి సాగు చేశాడు. పంట పూత దశలో ఉంది. కొంతకాలంగా వర్షాలు కురుస్తుండటంతో యూరియా కోసం రెండు పర్యాయాలు మోత్కూరు సింగిల్ విండో గోదాముకు వచ్చాడు. వచ్చిన ప్రతీసారి అతనికంటే ముందు సీరియల్‌లో ఎక్కువ మంది రైతులు ఉండటం, యూరియా తక్కువగా రావడంతో నిరాశతో వెనుదిరిగాడు. ప్రైవేట్‌గా 10 యూరియా బస్తాలు ఒకటి రూ.300 చొప్పున కొనుగోలు చేశానని వాపోయాడు.

పోలీస్ పహారాలో పంపిణీ

ఆత్మకూర్(ఎం) పీఏసీఎస్‌కు ఈనెల 29వ తేదీన 220 బస్తాల యూరియా వచ్చింది. పాస్ పుస్తకానికి రెండు బస్తాల చొప్పున పంపిణీ చేశారు. మొదట వచ్చిన రైతులకే యూరియా లభించింది. సుమారు 50 మంది రైతులకు అందకపోవడంతో నిరాశతో వెళ్లిపోయారు. పోలీసుల ఆధ్వర్యంలో యూరియా పంపిణీ చేశారు.

ఖాళీ చేతులతో తిరిగి వెళ్లిన



ఎనిమిది ఎకరాల్లో పంటలు సాగు చేశాం. ప్రస్తుతం పెరిగే దశలో ఉన్నాయి. వర్షాలు కురుస్తుండటంతో యూరియా అత్యవసరం అయ్యింది. పీఏసీఎస్ కార్యాలయానికి రెండు సార్లు వచ్చినా ఒక్క సంచి కూడా దొరకలేదు. యూరియా వచ్చిందని తెలియడంతో సోమవారం కూడా సహకార సంఘం బ్యాంకుకు వచ్చి ఉదయం నుంచి సాయంత్రం వరకు లైన్‌లో నిల్చున్నా. చివరికి ఖాళీ చేతులతోనే తిరిగి వెళ్లిన.

–జాగిలాపురం సత్తయ్య, పల్లెపహాడ్



తుర్కపల్లి పీఏసీఎస్ వద్ద బారులుదీరిన రైతులు

ప్రజల దృష్టి మళ్లించేందుకే కుట్రలు



భువనగిరిలో రాస్తారోకో చేస్తున్న బీఆర్‌ఎస్ శ్రేణులు, చిత్రంలో పైళ్ల శేఖర్‌రెడ్డి, గొంగిడి సునీత, భిక్షమయ్యగౌడ్, చింతల వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు

- ఎవరెన్ని చేసినా కేసీఆర్‌ను తెలంగాణ ప్రజల నుంచి దూరం చేయలేరు
- మాజీ ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్‌రెడ్డి, గొంగిడి సునీత, భిక్షమయ్యగౌడ్

భువనగిరి: ఆచరణకు సాధ్యం కాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. వాటిని అమలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తుందని మాజీ ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్‌రెడ్డి, గొంగిడి సునీత, భిక్షమయ్యగౌడ్ విమర్శించారు. హామీలను అమలు చేయకుండా ప్రజల దృష్టిని మరల్చేందుకు కుట్రలు చేస్తుందని మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై సీబీఐ విచారణకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడాన్ని వ్యతిరేకిస్తూ సోమవారం బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో భువనగిరిలో రాస్తారోకో నిర్వహించి సీఎం రేవంత్‌రెడ్డి దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కేసీఆర్‌ను బదనాం చేయడమే పనిగా పెట్టుకుందన్నారు. రాష్ట్రంలో సాగు నీటి కష్టాలు తీర్చేందుకు కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించారని గుర్తు చేశారు. జిల్లాను సస్యశ్యామలం చేయటానికి బస్వాపూర్ రిజర్వాయర్ నిర్మించారని, గంధమల్ల రిజర్వాయర్‌కు ఆనాడే ప్రతిపాదనలు రూపొందించారని గుర్తు చేశారు. కేసీఆర్ చరిష్మాను ఎవ్వరూ తగ్గించలేరని, కాళేశ్వరం ప్రాజెక్ట్ అవినీతి పేరుతో కాంగ్రెస్ చౌకబారు రాద్ధాంతం చేస్తుందన్నారు. ఎవరెన్ని కుట్రలు చేసినా కేసీఆర్ తెలంగాణ ప్రజల నుంచి దూరం చేయలేరని పేర్కొన్నారు. అంతకు ముందు బస్వాపురం రిజర్వాయర్ నుంచి తీసుకువచ్చిన నీటితో తెలంగాణతల్లి విగ్రహానికి అభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వర్లరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ జడల అమరేందర్, రైతు సమన్వయ సమితి మాజీ జిల్లా కో ఆర్డినేటర్ కొల్పుల అమరేందర్, మున్సిపల్ మాజీ చైర్మన్ అంజనేయులు, పార్టీ పట్టణ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఏవీ కిరణ్‌కుమార్‌రెడ్డి, రచ్చ శ్రీనివాస్‌రెడ్డి, ర్యాకల శ్రీనివాస్ మండల కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు, మాజీ ప్రజా ప్రతినిధులు, మాజీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

వినతులిచ్చి.. ఆదుకోవాలని కోరి..

భువనగిరిటౌన్ : కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి అర్జీదారులు తరలివచ్చారు. అధికారులకు గోడు చెప్పుకొని, వినతులు అందజేసి, ఆదుకోవాలని కోరారు. అదనపు కలెక్టర్లు వీరారెడ్డి, భాస్కర్‌రావు, జెడ్పీ సీఈఓ శోభారాణి, డీఆర్‌ఓ జయమ్మ, డీఆర్‌డీఓ నాగిరెడ్డి, హౌసింగ్ పీడీ విజయ్‌సింగ్ అర్జీలు స్వీకరించారు. 50 వరకు అర్జీలు రాగా వీటిలో ఎక్కువగా రెవెన్యూ శాఖకు సంబంధించినవి 40, పంచాయతీరాజ్ శాఖ 4 , సంక్షేమ, మున్సిపాలిటీ , విద్య, సర్వే ల్యాండ్స్, లీడ్ బ్యాంకు తదితర శాఖలకు సంబంధించివి ఒక్కొకటి చొప్పున ఉన్నాయి. అర్జీలను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులను అదనపు కలెక్టర్లు ఆదేశించారు. పనులు వదులుకొని సుదూర ప్రాంతాల నుంచి వ్యయ ప్రయాసలకోర్చి వస్తుంటారని, పెండింగ్ ఉంచకుండా సత్వర పరిష్కారం చూపాలని పేర్కొన్నారు.



అర్జీదారుల సమస్యలు ఆలకిస్తున్న అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు

యూరియా పంపిణీలో రాష్ట్రం విఫలం



కలెక్టరేట్ గేట్ వద్ద ధర్నా చేస్తున్న బీజేపీ శ్రేణులు, చిత్రంలో కాసం వెంకటేశ్వర్లు, ఊట్కూరి అశోక్‌గౌడ్, పాశం భాస్కర్, గూడూరు నారాయణరెడ్డి, కాదూరి అచ్చయ్య తదితరులు

- కలెక్టరేట్ ఎదుట బీజేపీ మహాధర్నా

సాక్షి, యాదాద్రి: అవసరాల మేరకు కేంద్రం యూరియా సరఫరా చేసినా రైతులకు పంపిణీ చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడు ఊట్కూరి అశోక్‌గౌడ్ విమర్శించారు. ప్రజా సమస్యలు, యూరియా కొరతను నిరసిస్తూ బీజేపీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం కలెక్టరేట్ ఎదుట మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూరియా చీకటిబజారుకు తరలిపోతున్నా రాష్ట్ర ప్రభుత్వం చూసీ చూడనట్లు వ్యవహరిస్తుందన్నారు. ఫలితంగా యూరియా కొరత ఏర్పడి రైతులు పంపిణీ కేంద్రాల వద్ద పడిగాపులు కాయల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. బస్వాపూర్ రిజర్వాయర్ ముంపు బాధితులకు పరిహారం ఇవ్వడంలోనూ జాప్యం చేస్తుందన్నారు. మూసీ పునరుజ్జీవం చేయాలని, మూసీతోపాటు వాగులపై హైలెవల్ వంతెనలు నిర్మించాలని, గంధమల్ల రిజర్వాయర్‌ను త్వరితగతిన పూర్తిచేసి ఆలేరు నియోజకవర్గానికి సాగు నీరందించాలని డిమాండ్ చేశారు. భువనగిరిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఏర్పాటు చేయాలని, మదర్ డైయిరీ రైతులకు పాల బిల్లులు విడుదల చేయాలని, కంపెనీల్లో స్థానికులకే ఉద్యోగాలివ్వాని పేర్కొన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ వీరారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు పాశం భాస్కర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గూడూరు నారాయణరెడ్డి, నాయకులు చందుపట్ల వెంకటేశ్వర్‌రావు, వేముల అశోక్, యెన్నం శివకుమార్, రచ్చ శ్రీనివాస్, గూడూరు జైపాల్‌రెడ్డి, సుర్వి శ్రీనివాస్, చందా మహేందర్‌గుప్తా, కాదూరి అచ్చయ్య, రత్నపురం బలరాం మాధురిచంద్ర, వైజయంతి, మణికంట, ఉడుత భాస్కర్, బట్టు క్రాంతి,పట్నం కపిల్, ఆకుతోట రామకృష్ణ, ఎండీ మహమూద్, గంగేష్ పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ బిల్లు చరిత్రాత్మకం

భువనగిరిటౌన్ : బీసీలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లు అసెంబ్లీలో ఏకగ్రీవంగా ఆమోదం పట్ల కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి. సోమవారం డీసీసీ అధ్యక్షుడు సంజీవరెడ్డి ఆధ్వర్యంలో భువనగిరిలో బాణసంచా కాల్చి ప్రభుత్వానికి మద్దతుగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా డీసీసీ కార్యాలయంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు బుద్ధిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, పోత్నక్ ప్రమోద్‌కుమార్, ఈవీ శ్రీనివాస్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. బీసీ రిజర్వేషన్లపై బీఆర్‌ఎస్, బీజేపీలు గల్లీలో జై, ఢిల్లీలో నై అంటున్నాయని విమర్శించారు. బీసీ రిజర్వేషన్ బిల్లుతో దేశానికే తెలంగాణ రోల్ మోడల్ గా నిలిచిందన్నారు. బిల్లుకు చట్టబద్ధత కల్పించే వరకు కాంగ్రెస్ పార్టీ పోరాడుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్, బీజేపీలకు బీసీల చేతిలో గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ డెలిగేట్ తంగెళ్లపల్లి రవికుమార్, మున్సిపల్ మాజీ చైర్మన్ బర్రె జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.



బాణాసంచా కాల్చుతున్న కాంగ్రెస్ నాయకులు

వర్షం నష్టంపై అంచనాల రూపకల్పన

సాక్షి,యాదాద్రి : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సీతక్కతో కలిసి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. భారీ వర్షాలతో కలిగిన నష్టాన్ని శాఖల వారీగా అంచనా వేసి నివేదికలు రూపొందించి ప్రభుత్వానికి అందజేయాలని ఆదేశించారు. నేషనల్ డిజాస్టర్ నిధులు వినియోగించుకోవాలని సూచించారు. అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ హనుమంతరావు మాట్లాడుతూ.. వర్షనష్టంపై అంచనాలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీసీపీ అక్షాంశ్ యాదవ్, అదనపు కలెక్టర్లు వీరారెడ్డి, భాస్కర్‌రావు, జెడ్పీ సీఈఓ శోభారాణి, ఆర్డీఓ కృష్ణారెడ్డి, డీఆర్‌డీఓ నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానం అమలు చేయాలి



భువనగిరిలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉద్యోగ సంఘాల ప్రతినిధులు

- జిల్లా ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్ మందడి ఉపేందర్‌రెడ్డి

భువనగిరిటౌన్ : కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం(సీపీఎస్) రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని విధానం అమలు చేయాలని జిల్లా ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్ మందడి ఉపేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం పెన్షన్ విద్రోహ దినంగా పాటిస్తూ ఉద్యోగ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ నుంచి ధర్నా చౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. వృద్ధాప్యంలో లక్షలాది ఉద్యోగుల భద్రత, కుటుంబాల సంక్షేమాన్ని బలి తీసుకున్న స్కీం సీపీఎస్ అని పేర్కొన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఆర్థిక, సామాజిక భద్రత కల్పించకుండా పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులకు లాభం చేకూర్చే విధంగా ఉన్న సీపీఎస్ విధానం ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన విధంగా సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కరించే వరకు పోరాటం కొనసాగుతుందన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు, పెన్షనర్ల సంఘాలు, నాలుగో తరగతి ఉద్యోగ సంఘాల నేతలు మాట్లాడుతూ సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భువనగిరి ఆర్డీఓ కృష్ణారెడ్డి, ఉద్యోగ సంఘాల జేఏసీ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ జగన్‌మోహన్‌ప్రసాద్, నాయకులు ఖదీర్, భగత్, మధుసుధన్‌రెడ్డి, యాదయ్య, శ్రీనివాస్, లక్ష్మీనర్సింహారెడ్డి, కుమార్, శశికాంత్ తదితరులు పాల్గొన్నారు.

గణేషా.. గస్తీ గాడి తప్పింది!

పెట్రోలింగ్ పోలీసులకు కాసుల వర్షం

- వినాయక మండప నిర్వాహకుల నుంచి డబ్బులు డిమాండ్
- డీజేలకు అనుమతి లేదంటూ వసూళ్లు



చౌటుప్పల్ : పెట్రోలింగ్ పోలీసులకు గణేష్ నవరాత్రులు కాసులు కురిపిస్తున్నాయి. నిబంధనల పేరిట అందినకాడికి దండుకుంటున్నారు. మండపాల నిర్వాహకులు చేసేది లేక పోలీసులు అడిగినంత ఇవ్వక తప్పడం లేదు. వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా మండపాల వద్ద, శోభయాత్రలో డీజేలకు పోలీస్ శాఖ అనుమతులు నిరాకరించింది. అయితే జోష్ నింపాలంటే డీజేల తప్పనిసరి కావడంతో నిబంధనలు ఒప్పుకోకున్నా.. ఉత్సవ కమిటీలు డీజేలు ఏర్పాటు చేసుకుంటున్నాయి. ఇదే అదనుగా పెట్రోలింగ్ పోలీసులు చేతివాటం ప్రదర్శిస్తున్నట్లు తెలుస్తోంది. మండపాల వద్ద, శోభాయాత్రలో డీజేలు ఏర్పాటు చేసినట్లు తెలిసిందే తడవుగా అక్కడికి చేరుకొని కేసులు నమోదు చేస్తామంటూ బెదిరింపులకు దిగుతున్నారు. ఆ తర్వాత బేరసారాలు మాట్లాడుకుంటున్నారు.

అంకిరెడ్డిగూడెంలో హడావుడి

చౌటుప్పల్ మండల పరిధిలోని అంకిరెడ్డిగూడెంలోని ఈదమ్మ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయకుడిని ఆదివారం రాత్రి నిమజ్జనానికి తరలించారు. తంగడపల్లికి చెందిన యువకులు డీజే వాహనం ఏర్పాటు చేశారు. డీజే పెట్టారన్న విషయం తెలియడంతో పెట్రోలింగ్ పోలీసులు అక్కడికి చేరుకున్నారు. అనుమతులు లేవని, కేసులు నమోదు చేస్తామని కాసేపు హడావుడి చేశారు. నిర్వాహకుల నుంచి రూ.5 వేలు వసూలు చేశారు. డీజే నిర్వాహకులనూ వదల్లేదు. వెయ్యి రూపాయలు అడగగా వారు రూ.500 సమర్పించుకున్నట్లు తెలిసింది. దాంతో డీజే సజావుగా కొనసాగింది. ఇదే పరిస్థితి మండల వ్యాప్తంగా ఉన్నట్లు మండపాల నిర్వాహకులు ఆరోపిస్తున్నారు.

- ప్రజా సమస్యలపై సీపీఎం పోరుబాట



చౌటుప్పల్: ప్రజా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం చౌటుప్పల్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు

కోతుల దాడిలో గాయాలు

హుజూర్‌నగర్ : మండలంలోని అమర వరం గ్రామంలో సోమవారం వీర బోయిన వెంకన్న తన ఇంట్లో గేదెలకు మేత వేస్తుండగా వెనుక నుంచి కోతుల గుంపు దాడి చేసింది. దీంతో అతడి కాలుకు గాయాలు కావడంతో హుజూర్ నగర్‌లోని ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు.

సెల్‌ఫోన్ వదిలితేనే స్టీరింగ్

బస్సు నడిపే సమయంలో సెల్‌ఫోన్ వాడకంపై నిషేధం

- ఆర్టీసీ డిపోలోని సెక్యూరిటీ కార్యాలయంలో అప్పగించాకే విధులకు వెళ్లాలని సూచన
- పైలట్ ప్రాజెక్టు కింద మిర్యాలగూడ ఆర్టీసీ డిపో ఎంపిక
- సోమవారం నుంచి అమలులోకి వచ్చిన నిర్ణయం

మిర్యాలగూడ టౌన్ : కొంత మంది ఆర్టీసీ డ్రైవర్లు సెల్ ఫోన్ మాట్లాడుతూ బస్సు నడుపుతుండడంతో ప్రమా దాలు చోటు చేసుకుంటున్నాయి. వీటికి చెక్ పెట్టేందుకు ఆర్టీసీ కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై డ్యూటీ సమ యంలో బస్సు డ్రైవర్లు సెల్‌ఫోన్ వాడొద్దని ఆదేశాలు జారీ చేసింది. ముందుగానే సెల్‌ఫోన్లను డిపోలోని సెక్యూరిటీ అధికారి కార్యాలయంలో డిపాజిట్ చేసి విధులకు వెళ్లాలని సూచించింది.

ఆయా డిపోల్లో సర్వే నిర్వహించిన ఆర్టీసీ

ఉమ్మడి జిల్లాలో దేవరకొండ, నార్కట్‌పల్లి, యాద గిరిగుట్ట, సూర్యాపేట, కోదాడ, మిర్యాలగూడ, నల్లగొండ డిపోలు ఉండగా ఆయా డిపోల్లో గత నెల లో ఇతర జిల్లాలకు సంబంధించిన ఆర్టీసీ సిబ్బందిని ఒక్కో డిపోకు ఐదుగురు చొప్పున కేటాయించి ఆర్టీసీ ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. ఒక్క మిర్యాలగూడ డిపోలో 162 మంది డ్రైవర్లు ఉండగా వీరిలో సుమారు 90 మంది వరకు సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తు న్నట్లు సర్వేలో వెల్ల డైంది. దీంతో నల్ల గొండ రీజియన్‌లో మిర్యాలగూడ ఆర్టీసీ డిపోను పైలట్ ప్రాజెక్టు కిం ద ఎంపిక చేశారు. రాష్ట్రంలో 11 డిపో ల్లో ఈ నిర్ణయం తీసుకోగా ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మిర్యాలగూడ డిపోలో సోమవారం నుంచి అమలు చేసింది. డిపోలో మొత్తం 162 మంది డ్రైవర్లు ఉండగా ప్రతి రోజు 70 నుంచి 100 మంది వరకు విధులు నిర్వర్తిస్తున్నారు. అయితే విధి నిర్వహ ణలో భాగంగా తొలి రోజు డ్యూటీకి వెళ్లి 38 మంది విధుల్లో చేరే ముందు తన సెల్‌ఫోన్లను డిపోలోని సెక్యూరిటీ అధికారి కార్యాలయంలో డిపాజిట్ చేశారు. విధులు ముగించుకున్న తరువాత ఇంటికి వెళ్లేటప్పుడు వీటిని తీసుకువెళ్లే విధంగా ఏర్పాట్లు చేశారు. సెల్‌ఫోన్లను భద్రపరిచేందుకు ప్రత్యేకంగా సంచులను తయారు చేయించారు. ఏదైనా అత్యవసరమైన పరిస్థి తుల్లో బస్సులోని సంబంధిత కండక్టర్లకు ఫోన్ ద్వారా సమాచారం అందిస్తే డ్రైవర్ ఫోన్ మాట్లాడేందుకు అవకాశం కల్పించనున్నారు. కాగా.. మిర్యాలగూడ డిపో నుంచి కాకినాడ, తిరుపతికి వెళ్లే బస్సులకు సం బంధించి 12 మంది డ్రైవర్లు ఉండగా దూరపు ప్రయా ణంతో పాటు ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకుంటుండటం తో ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ఈ డ్రైవర్లకు ఈ నిబంధన మినహాయించారు.



మిర్యాలగూడ ఆర్టీసీ డిపో గేటు వద్ద సెల్‌ఫోన్‌ను అప్పగిస్తున్న ఆర్టీసీ డ్రైవర్



ప్రత్యేకంగా తయారు చేసిన సంచుల్లో భద్రపరిచిన ఫోన్లు

ప్రయాణికుల రక్షణ కోసమే



ఆర్టీసీ తీసుకున్న నిర్ణయాన్ని బస్సు డ్రైవర్లు కూడా స్వాగ తిస్తున్నారు. విధి నిర్వహ ణలో భాగంగా డ్యూటీకి వెళ్లే సమయంలో సెక్యూరిటీ కార్యాలయంలో డిపాజిట్ చేస్తున్నారు. ప్రయాణి కులను గమ్యస్థానానికి సురక్షితంగా చేర్చాలనేది ఆర్టీసీ లక్ష్యం. అయితే చాలా మంది కూడా తమ సెల్‌ఫోన్లు ఇంటి వద్దనే ఉంచుతుండగా కొంత మంది డిపో వద్ద డిపాజిట్ చేసి డ్యూటీ దిగి వెళ్లిపోయే సమయంలో తీసుకెళ్తున్నారు. ఏదైనా అత్యవసరమని అనుకుంటే తాము ఆ బస్సు కం డక్టర్‌కు ఫోన్ చేసి ఆ డ్రైవర్‌తో మాట్లాడిస్తాం.

– రాంమోహన్‌రెడ్డి, ఆర్టీసీ డీఎం, మిర్యాలగూడ

కొనసాగుతున్న కృష్ణమ్మ పరవళ్లు



26గేట్ల ద్వారా విడుదలవుతున్న వరద నీరు

నాగార్జునసాగర్: నాగార్జునసాగర్‌కు ఎగువ నుంచి వరద కొనసాగుతోంది. నాగార్జునసాగర్ జలాశ యానికి 3,28,996 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. 26 రేడియల్ క్రస్ట్‌గేట్ల ద్వారా, విద్యు దుత్పాదన ద్వారా దిగువ కృష్ణానదిలోకి 3,12,170 క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేస్తు న్నారు. సాగర్ జలాశయం గరిష్ట స్థాయి నీటిమట్టం 590.00అడుగులు, నీటి నిల్వ సామర్థ్యం 312.0450 టీఎంసీలు కాగా ప్రస్తుతం 586.10 అడుగులు, 300.8385 టీఎంసీలు ఉంది.

ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య

మర్రిగూడ: అనారోగ్య సమస్యలు, ఆర్థిక ఇబ్బందుల తో మనస్థాపం చెందిన ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మర్రిగూడ మండలంలోని రాంరెడ్డిపల్లి గ్రామంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. రాంరెడ్డిప ల్లి గ్రామానికి చెందిన జంపాల తిరుపతయ్య(47) గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో, ఆర్థిక ఇబ్బం దులతో బాధపడుతున్నాడు. కుటుంబాన్ని ఎలా పోషించాలో అర్థంకాక మనోవేదనతో తన కటింగ్ షాప్‌లో ఆదివారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మ హత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న పోలీసు లు సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించిన అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు. మృతుడి భార్య జంపాల విజయ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కృష్ణారెడ్డి సోమవారం తెలిపారు.



తిరుపతయ్య (ఫైల్)

బంగారం, నగదు చోరీ

హుజూర్‌నగర్ : ఓ వ్యక్తి తన భార్యను తీసుకువచ్చేం దుకు అత్తగారింటికి వెళ్లి రెండు రోజుల తర్వాత వచ్చే సరికి ఇంట్లో బంగారం, వెండి ఆభరణాలు, నగదు ను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఈ సంఘటన హుజూర్‌నగర్ మండలంలోని గోపాలపు రంలో సోమవారం వెలుగుచూసింది. బాధితుడు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గోపాల పురం గ్రామానికి చెందిన పేరూరి భాగ్యరాజు గత నెల 28న తన భార్యను తీసుకురావడానికి అత్తగారి ఊరైన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అన్నపరెడ్డిప ల్లి మండలం ఎర్రగుంట గ్రామానికి వెళ్లాడు. అక్కడ రెండు రోజులు ఉండి సోమవారం స్వగ్రామం చేరు కున్నారు. ఇంటికి వచ్చి చూడగా తాళం పగలగొట్టి ఇంట్లో వస్తువులు చిందర వందరగా పడేసి ఉన్నాయి. బీరువాను పరిశీలించగా.. అందులోని సుమారు 10 తులాల బంగారు, 20 తులాల వెండి ఆభరణాలు, రూ.5 లక్షల నగదు అపహరణకు గురైంది. విషయం తెలుసుకున్న సీఐ చరమంద రాజు, ఎస్‌ఐ మోహన్‌బాబు సంఘటనా స్థలాన్ని క్లూస్ టీంతో సందర్శించి వివరాలు నమోదు చేసు కున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మోహన్‌బాబు తెలిపారు.



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న పోలీసు అధికారులు

భద్రత మరింత పెంచాలి : ఈఓ వెంకట్రావ్

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయానికి, క్షేత్రా నికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, అవాంఛనీయ సం ఘటనలు చోటు చేసుకోకుండా మరింత భద్రత పెంచే విధంగా పోలీస్ అధికారులు చర్యలు చేపట్టాలని ఆలయ ఈఓ వెంకట్రావ్ తెలిపారు. యాద గిరి కొండపైగల ప్రధాన కార్యాలయంలో ఏసీపీ శ్రీనివాస్ నాయుడుతో పాటు పోలీస్ అధికారులు, ఆలయ ఉద్యోగులతో సోమవారం రాత్రి ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆలయ ఈఓ మాట్లాడుతూ.. కొండ కిం ద దేవస్థానం పరిసర ప్రాంతాలు, గిరి ప్రదక్షిణ మార్గంలో, దేవస్థానం అద్దె గదుల ప్రాంతాల్లో రాత్రి సమయాల్లో విధిగా గస్తీ నిర్వహించే విధంగా చర్య లు తీసుకోవాలన్నారు. టెంపుల్ సిటీకి వెళ్లే మార్గాల్లో బారికేడ్లతోపాటు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. కొండపైన స్థలం తక్కువ ఉండడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ఉండేందుకు సాధ్యమై నంత వరకు కొండ కింద వాహనాలను పార్కింగ్ చేసే విధంగా చర్యలు చేప ట్టాలన్నారు. కొండ కింద వాహనాలు పార్కింగ్ చేసిన భక్తులను కొండపైకి చేరే విధంగా ఏసీ బస్సులను నడిపేందుకు నిర్ణయం తీసుకున్నామన్నారు. కల్యాణకట్ట, వ్రత మండపం, శివాలయం క్యూ మార్గంలో బ్యాగేజ్ స్కానర్లు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. సమావేశంలో ఏసీపీ శ్రీనివాస్ నాయుడు, సీఐ భాస్కర్, ఆలయ డిప్యూటీ ఈఓ భాస్కర్ శర్మ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు దయాకర్ రెడ్డి, రామారావు, ఆర్‌ఐ శేషగిరిరావు పాల్గొన్నారు.

యాదగిరీశుడి కల్యాణం అద్భుతం

- శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయానికి కెనడా ప్రధాని ప్రశంస

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనర సింహస్వామి ఆలయాన్ని, నిర్వాహ కులను కెనడా ప్రధాని మార్క్ కార్నీ అభినందిస్తూ ఆదివారం రాత్రి లేఖ పంపారు. ఆలయ పూజారులు, అర్చకులు కెనడా దేశంలోని వివిధ ప్రాంతాల్లో గత నెలలో ఆలయ విశ్రాంత ప్రధానార్చకులు నల్లం థీఘల్ లక్ష్మీనరసింహాచార్యులు, ఆలయ అధికారి గజివెల్లి రఘు ఆధ్వ ర్యంలో యాదగిరి లక్ష్మీనరసింహస్వా మి కల్యాణం జరిపించారు. ఆగస్టు 23న విండ్సర్, 24వ తేదీన టొరంటో నగరంలో, 30న ఒట్టావా నగరంలో కల్యాణం జరిపించారు. ఈ సందర్భంగా కెనడా ప్రధాని మార్క్ కార్నీ లేఖలో పలు అంశాలను ప్రస్తావించారు. యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వా మి దేవాలయంలో భక్తులకు అందుతున్న సేవలపై టెంపుల్ బోర్డును అభి నందించారు. కెనడాలోని ఒట్టవా నగరంలో గల శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో ఇటీవల స్వామి వారి కల్యాణం జరిగిన తీరుతెన్నులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. స్వామి వారి కళ్యాణం చాలా ఘనం గా, వైభవముగా, అద్భుతంగా నిర్వహించారని కొనియాడారు. హిందూ సంస్కృతిలోని విభిన్నత, ఆధ్యాత్మికత, ఐక్యతను ప్రశంసించారు. కాగా, కెనడా ప్రధాని మార్క్ కార్నీ లేఖపై రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ఆలయ ఈవో వెంకటరావు హర్షం వ్యక్తం చేశారు.



యాదగిరి క్షేత్ర నిర్వాహకులకు కెనడా ప్రధాని రాసిన లేఖ

నిడమనూరు మార్కెట్‌ను సందర్శించిన విద్యార్థులు



మార్కెట్ చైర్మన్‌తో సమావేశమైన విద్యార్థులు

నిడమనూరు : ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం కంపాసాగర్‌కు చెందిన బీఎస్సీ అగ్రికల్చర్ విద్యార్థులు సోమవారం నిడమనూరు వ్యవసాయ మార్కెట్‌ను సందర్శించారు. విద్యార్థు లు మార్కెట్ పరిధిలోని వ్యవసాయ ఉత్పత్తులు, మార్కెట్ సౌకర్యాలను పరిశీలించారు. కొనుగోళ్లు, అమ్మకాల వివరాలను మార్కెట్ చైర్మన్ అంకతి సత్యంను అడిగి తెలుసుకున్నారు. మార్కెట్ ద్వారా పశువులకు వైద్యశిబిరాలు కల్పించి రైతులకు పశు పోషణలో సహాయ సహకారాలు అందిస్తున్నట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో కార్యదర్శి చందర్‌రావు, వర్సిటీ విద్యార్థులు పాల్గొన్నారు.

రవాణా శాఖ వెబ్‌సైట్‌పై అవగాహన కల్పించాలి

- రవాణా శాఖ అధికారి వాణి

కోదాడరూరల్ : రవాణాశాఖ నూతనంగా తీసుకువ చ్చిన వెబ్‌సైట్ www.ttransport.gov.in పై వాహ నదారులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని ఉమ్మడి జిల్లా రవాణా శాఖ అధికారి వాణి సూచిం చారు. ఆదివారం రాత్రి కోదాడ మండల పరిధిలోని చిమిర్యాల శివారులో ఉన్న అంతర్రాష్ట్ర రవాణా శాఖ చెక్‌పోస్టును ఆమె తనిఖీ చేశారు. టెంపరరీ పర్మిట్, వలంటరీ ట్యాక్స్, స్పెషల్ పర్మిట్‌పై వాహ నదారులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ విధానంతో సిబ్బందికి పనిభారం తగ్గడంతో పాటు వాహనదారులకు సమయం ఆదా అవుతుంద న్నారు. ఆమె వెంట నల్లగొండ డీటీఓలు కొం డయ్య, సూర్యాపేట డీటీఓ జయప్రకాష్‌రెడ్డి, ఎం వీఐలు రాజ్‌మహ్మద్, శ్రీనివాస్, ఏఎంవీఐలు సాయిప్రసాద్, లావణ్య, సిబ్బంది ఉన్నారు.



చిమిర్యాల శివారులోని చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న వాణి

చెరువు వద్ద కాపలాకు వెళ్లి.. అస్వస్థతకు గురై మృతి

వలిగొండ : చేపల చెరువు వద్ద కాపలాకు వెళ్లిన ఓ యువకుడు అస్వస్థతకు గురై అక్కడే మృతి చెందిన సంఘటన వలిగొండ మండలంలోని గోకారంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గోకారం గ్రామానికి చెందిన చెరక శ్రీను(35) చేపలు పట్టుకొని జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం రాత్రి గ్రామంలోని చెరువు వద్ద కాపలాగా చెరక విక్రమ్, చెరక యాద గిరితో కలిసి వెళ్లాడు. అస్వస్థతకు గురైన శ్రీను అక్కడే మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామన్నపేట ప్రభుత్వ ఆస్ప త్రికి తరలించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై యుగంధర్ సోమవారం తెలిపారు.

గర్భిణి మృతి కేసులో మరో ముగ్గురు అరెస్టు

- వివరాలు వెల్లడించిన డీఎస్పీ ప్రసన్నకుమార్

సూర్యాపేటటౌన్ : అబార్షన్ చేయడంతో వైద్యం వికటించి గర్భిణి మృతి చెందిన కేసులో మరో ముగ్గురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ ప్రసన్నకుమార్ తెలిపారు. సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని డీఎస్పీ కార్యాలయం లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివ రాలు వెల్లడించారు. మోతె మండలం రాఘవాపురం గ్రామానికి చెందిన ఐదు నెలల గర్భిణి బయ్యు అనూష మృతి చెందిన కేసులో సూర్యాపేట పట్టణంలోని ఒమే గా హాస్పిటల్‌లో అబార్షన్‌కు ఏర్పాట్లు చేసిన హాస్పి టల్ నిర్వాహకుడు ఏ1 గోరంట్ల సంజీవ, సూర్యాపేట మండలం టేకుమట్ల గ్రామానికి చెందిన ఆర్‌ఎంపీ వైద్యుడు ఏ2 జాల జానయ్యను, ఒమెగా ఆస్పత్రి మేనేజ్‌మెంట్ ఏ6 వేణును సూర్యాపేటలోని ఓ హోటల్ వద్ద అరెస్టు చేశారు.

మూడోసారి ఆడపిల్ల అని తెలియడంతో అబార్షన్

మోతె మండలం రాఘవపురం గ్రామానికి చెందిన బయ్యు నగేష్‌కు ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. భార్య అనూష మూడోసారి ప్రెగ్నెంట్ కాగా.. లింగ నిర్ధా రణ పరీక్ష చేసేందుకు తన దగ్గరి బంధువైన అదే గ్రామానికి చెందిన ఏ8 ఉప్పల సందీప్ ద్వారా టేకుమట్ల గ్రామంలో ఆర్‌ఎంపీగా పని చేస్తున్న ఏ2 జాల జానయ్యను సంప్రదించాడు. నకిరేకల్‌కు చెం దిన ఆర్‌ఎంపీ ఏ3 బాత్క యాదగిరి వద్ద మే 17న అల్ట్రా సౌండ్ స్కానింగ్ నిర్వహించి గర్భంలో ఉంది ఆడ శిశువు అని తెలుసుకున్నారు. స్కానింగ్ చేయించినందుకు ఆర్‌ఎంపీ జానయ్య ఏ9 బయ్యు నగేష్ వద్ద రూ.12వేలు తీసుకున్నాడు. అబార్షన్ చేయించేందుకు జిల్లా కేంద్రంలోని ఒమేగా హాస్పి టల్(సంజీవిని హాస్పిటల్) నిర్వాహకులు గోరెంట్ల సంజీవ, వీరబోయిన వేణును సంప్రదించి కూసు మంచికి చెందిన నాగరాజు, అర్వపల్లికి చెందిన చెవుగోని గణేష్‌లతో అబార్షన్ చేయించారు. గర్భిణీకి వైద్యం వికటించి తీవ్ర రక్తస్రావం కావడం తో ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్ష చేసిన వైద్యులు అనూష అప్పటికే మృ తి చెందినట్లు నిర్ధారించారు. ఈ విషయమై జిల్లా వైద్యాధికారి కార్యాలయం వారు సూర్యాపేట పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు జరిపి కేసు లో మొత్తం 10 మంది నిందితులను గుర్తించినట్లు డీఎస్పీ తెలిపారు.

ఇప్పటికే నలుగురు రిమాండ్

ఈ కేసులో ఇప్పటికే ఏ8 అయిన ఉప్పల సందీప్‌ను, అబార్షన్ చేసిన చెవుగోని గణేష్‌ను మే 29న అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. అదేవిధంగా నకిరేకల్‌లో గర్భిణికి స్కానింగ్ చేసిన ఆర్‌ఎంపీ డాక్టర్ బాత్క యాదగిరిని ఆగస్టు 8న అరెస్టు చేసినట్లు చెప్పారు. అలాగే మరో మైనర్ వ్యక్తిని కూడా అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. సమా వేశంలో పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ప్రసన్నకుమార్

పంట తొలిదశలోనే తెగుళ్లను నివారిద్దాం

- తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గడ్డిపల్లి కేవీకే శాస్త్రవేత్త కిరణ్ సూచనలు



గరిడేపల్లి: వివిధ దశల్లో ఉన్న వరి పైర్లకు అగ్గి తెగులు (ఆకుమచ్చ దశ) ఆశించే అవకాశం ఉన్నందున రైతు లు తొలిదశలోనే గుర్తించి నివారణ చర్యలు తీసుకోవాలని గడ్డిపల్లి కేవీకే మృత్తిక శాస్త్రవేత్త కిరణ్ సూచించారు. వివిధ పంటల్లో తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఆయన మాటల్లోనే..

- వరిలో అగ్గితెగులు నివారణకు ట్రైసైక్లోజోల్ మ్యాంకోజెబ్ 2.5గ్రా లేదా ఐసోప్రోథయోలేన్ 1.5 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- ప్రధాన పొలాన్ని పొడి దుక్కి దున్ని, నీరు పెట్టి 3–4రోజులు ఉంచి.. వారం రోజులలోపు రోటవేటర్‌తో దమ్ము చేసుకొని నాట్లు వేసుకోవాలి. ఎకరానికి 50కిలోల డీఏపీ దమ్ము తర్వాత మరియు 25కిలోల యూరియా 14కిలోల యూరియా 14కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ నాట్లు వేసే ముందు వేసుకోవాలి.
- నత్రజని ఎరువును 3–4దఫాలుగా వేయాలి. దమ్ములోనూ, పంట బాగా దుబ్బు చేసే దశలో (25–30 కిలోల యూరియా) మరియు అంకురం తొడిగే దశలోనూ (25–30కిలోలు) బురద పనులో వెదజల్లి 36–48 గంటల తర్వాత పలుచగా నీరు పెట్టాలి.



కంది పంటపై రైతులకు అవగాహన కల్పిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

- రేగడి నేలల్లో పొటాష్ ఎరువును ఆఖరి దమ్ములో పూర్తిగా ఒకేసారి వేయాలి. తేలిక భూముల్లో ఆఖరి దమ్ములో సగం (14కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్), అంకురం ఏర్పడే దశలో (14కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్) మిగతా సగాన్ని వేయాలి.
- నాట్లు వేసేటప్పుడు ప్రతి 2మీటర్లకు 2అడుగు కాలిబాటలు తీసుకోవాలి. దమ్ము చేయకుండా నేరుగా విత్తినప్పుడు 25శాతం ఎరువును నాటు పద్ధతి కన్నా అధికంగా వేయాలి. మూడు సమాన భాగాలుగా నత్రజని ఎరువును విత్తిన 15–20రోజులకు, పిలక, చిరుపొట్ట దశలో వేయాలి. ఈ పద్ధతిలో 45రోజుల వరకు కలుపు లేకుండా జాగ్రత్త పడాలి.
- ప్రధాన పొలంలో కలుపు మొక్కల నివారణకు ఎకరానికి 4కిలోల బెన్సల్యూరాన్ మిథైల్ 0.6శాతం జిఆర్, ప్రెటిలాక్లోర్ 6శాతం జిఆర్ గుళికలను నాటిన 3–5రోజుల్లోపు 20కిలోల ఇసుకలో కలిపి చల్లుకోవాలి. నేరుగా వెదజల్లే పద్ధతి లేదా డ్రమ్ సీడర్ పద్ధతిలో సాగు చేసే రైతులు ఎకరానికి ప్రెటిలాక్లోర్, సాపనర్ 600–800మి.లీ 3–5రోజుల్లోపు 20కిలోల ఇసుకతో కలిపి చల్లాలి.
- ప్రధాన పొలంలో నాటిన 18–20రోజుల తర్వాత కాండం తొలిచే పురుగు నివారణకు కార్బోఫ్యూరాన్ 3సిజీ 10కిలోలు లేదా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4 సీజీ 8కిలోలు ఇసుకలో కలుపుకొని చల్లాలి.
- వరినాట్లు ఆలస్యమైతే ఉల్లికోడు ఆశించే అవకాశం ఉన్నందున దాని నివారణగా రైతులు కార్బోఫ్యూరాన్ 3సిజీ 10కిలోలు ఒక ఎకరానికి చల్లాలి.

పత్తి, కంది సస్యరక్షణ చర్యలు

- పత్తి చేను బెట్ట లేదా అధిక వర్షాలకు గురైనప్పుడు 19–19–19 లేదా 13:0:45లాంటి పోషకాలను లీటరు నీటికి 10గ్రా. చొప్పున కలిపి పిచికారీ చేసుకోవాలి.
- అధిక సాంద్రతలో పత్తిని సాగు చేస్తున్న రైతులు మొక్క పెరుగుదలను, శాఖీయ కొమ్మల పెరుగుదలను అదుపులో ఉంచుకోవాలి. పెరుగుదల నియంత్రణకు మొక్కల 40–50 రోజుల దశలో ఉన్నప్పుడు మెపిక్వాట్‌క్లోరైడ్ మందును లీటరు నీటికి 1.2మి.లీ కలుపుకొని పిచికారీ చేసుకోవాలి. తద్వారా పత్తికాయ సైజు కూడా సమానంగా ఉంటుంది. పత్తిలో తామర పురుగులు, పేనుబంక, పచ్చదోమ నివారణకు ఎసిఫేట్ 1.5 గ్రా. లేదా ఎసిటామిప్రిడ్ 0.2గ్రా. లేదా థయోమిథాక్సామ్ 0.2గ్రా. లేదా ఫిప్రోనిల్ 2.0మి.లీ లేదా ఫ్లోనికామిడ్ 0.3గ్రా. లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.25మి.లీ లేదా డైఫెన్ థయూరాన్ 1.22గ్రా. లేదా స్పైనోటోరమ్ 0.9 మి.లీ లేదా లోక్సాఫ్లోర్ 1గ్రా. లేదా ఎసిఫేట్, ఇమిడాక్లోప్రిడ్ 2గ్రా. లేదా డైనోటోఫ్యూరాన్ 0.4గ్రా. లీటరు నీటికి కలుపుకొని మందులను మార్చి మార్చి పిచికారీ చేసుకోవాలి.
- తెల్లదోమ నివారణకు సల్ఫోక్సాఫ్లోర్ 0.6గ్రా. లేదా డైఫెన్థయూరాన్ 1.25గ్రా. లేదా బైఫెన్ డైఫెన్థయూరాన్ 1.25 గ్రా. మందులను లీటరు నీటికి కలుపుకొని పిచికారి చేసుకోవాలి.
- గులాబీ రంగు పురుగు నివారణకు పంట పూత దశ నుండే లింగాకర్షక బుట్టలు ఎకరాకు 4 నుంచి 8 వరకు పెట్టుకోవాలి. గుడ్డి పూలను ఏరివేయాలి. పురుగు తాకిడిని బట్టి మొదటగా ప్రొఫెనోఫాస్ 2 మి.లీ వేప కషాయం లేదా వేపనూనె 5మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

- కంది పంటలో అంతరకృషి చేసి కలుపును నివారించి భూమిని గుల్లబారేలా చేస్తే భూమిలో తేమ బాగా నిలిచి బెట్టను కొంత వరకు తట్టుకోగ లదు. అంతర కృషి సాధ్యం కాని పరిస్థితుల్లో కలుపు నివారణకు విత్తిన 20రోజులకు ఇమాజితా ఫిర్ 300మి.లీ ఎకరానికి అనగా 1.5 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేస్తే గడ్డి, వెడల్పాకు కలుపును నివారించవచ్చు. బెట్ట పరిస్థితుల్లో పేనుబంక ఆశించి మొక్కలు పాలిపోతాయి. దీని నివారణకు 20గ్రా. యూరియా ద్రావణం లేదా 10గ్రాముల మల్టీ కె లేదా పాలిఫీడ్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.